సమస్యల వలయంలో బడి

- పాఠశాలల్లో పిల్లలకు అందని అల్పాహారం పథకం
- సీఎం బ్రేక్‌ఫాస్ట్‌కు పులిస్టాప్
- అకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- అసంపూర్తి నిర్మాణాలతో ఇబ్బందులు
- బిల్లులు సమయానికి రాక 'మధ్యాహ్న' కార్మికుల అవస్థలు



మామిడ్గి పాఠశాలలో సీఎం అల్పాహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

న్యాల్‌కల్, జూలై 10: బడికి వెళ్లిన విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తే విద్యార్థులు పస్తులతోనే ఉదయం బడికి వస్తున్నారు. మధ్యాహ్నం భోజనం పెట్టేంత వరకు విద్యార్థులు నిరీక్షించి నీరసించిపోకుండా బీఆర్ఎస్ సర్కార్ హయాంలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ఆకలి తీర్చింది. ప్రస్తుతం అది నిలిచిపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయకుండానే బడికి వస్తున్న విద్యార్థులు మధ్యాహ్నం భోజనం పెట్టేవరకు అలాగే ఉండాల్సిన పరిస్థితి. గత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కొనసాగింది. తిరిగి పాఠశాలల పునఃప్రారంభం తర్వాత మండలంలో ఎక్కడ కూడా అమలు కావడం లేదు. మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలల్లో 5,150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికైనా విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సీఎం బ్రేక్‌ఫాస్టు పథకం కింద ఖర్చు చేసిన డబ్బులు ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వకపోవడంతో నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.15 లక్షల వరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రావాల్సి ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

సీఎం బ్రేక్ ఫాస్ట్ పెట్టాలి

పేద విద్యార్థుల కోసం గతంలో పెట్టిన మాదిరే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి. ఒక్కో రోజు బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా స్కూల్‌కు వస్తున్నాం. దీంతో ఆ రోజు అకలితో మధ్యాహ్నం వరకు ఉండాల్సిన పరిస్థితి వస్తున్నది. సీఎం ఆలోచించి ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించాలి.

- వరుణ్, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్, హడ్నూర్

హోటల్ నీళ్లే దిక్కు

వేసవి సెలవుల తర్వాత ప్రారంభమైన మా పాఠశాలలో తాగడానికి నీళ్లు అందుబాటులో లేవు. దీంతో బయట హోటల్‌లో నీటిని తాగాల్సి వస్తుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటిని అందుబాటులో ఉంచాలి.

- రమేశ్, 10వ తరగతి, కంగ్టి

టిఫిన్ బంద్ అయ్యింది

గతంలో ప్రతిరోజూ ఉదయం టిఫిన్ పెట్టేవారు. వేసవి సెలవుల తర్వాత బడి ప్రారంభం అయిననాటి నుంచి పాఠశాలలో విద్యార్థులకు టిఫిన్ పెట్టడం లేదు. దీంతో కొంత ఆలస్యమైనా ఇంట్లోనే టిఫిన్ చేసి వస్తున్నాం. గతంలో పెట్టిన బ్రేక్‌ఫాస్ట్ మాదిరే ఇప్పుడు కూడా విద్యార్థులకు టిఫిన్ పెట్టాలి.

- సిధారెడ్డి, 10వ తరగతి, కంగ్టి

బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భోజనశాల

అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

బొంతపల్లి ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగాఉన్న వంటగదులు

గుమ్మడిదల, జూలై 10: 'మన ఊరు - మన బడి' పథకం కింద మంజూరైన భోజనశాల, వంట గదుల నిర్మాణం నిధులలేమితో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా భోజనశాల, ప్రాథమిక పాఠశాలలో కిచెన్ గదుల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా నిధులు మంజూరైతే గానీ, పనులు పూర్తి కావని టీచర్లు చెబుతున్నారు. వందలమంది విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని, అసంపూర్తి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోహీర్ ప్రాథమిక పాఠశాలలో వంటలు వండుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు రాజేశ్వరి

అప్పులు అవుతున్నయి

కోహీర్, జూలై 10: నాతోపాటు మరొకరు కలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నం. కానీ, మాకు టైంకు బిల్లులు రావడం లేదు. దీంతో అప్పులు చేసి కూరగాయలు, కోడిగుడ్లు తెచ్చి విద్యార్థులకు పెడుతున్నాం. ఎవరిని అడిగినా బిల్లులు వస్తాయి అని చెబుతున్నారే తప్ప.. రావడం లేదు. మాకు టైంకు బిల్లులు ఇవ్వాలి.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 10: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెలలో ప్రారంభం కానున్న హెచ్‌సీఏ బీ1 డివిజన్ 2-డే లీగ్‌లో పాల్గొనేందుకు అండర్-25 ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఈ నెల 12న ఉదయం 10 గంటలకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 10: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 12న ఉదయం 11 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వందన బుధవారం ప్రకటనలో తెలిపారు. డీ మార్ట్‌లో పని చేసేందుకు స్థానిక బైపాస్ రోడ్డులోని పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మొత్తం 135 ఖాళీలను భర్తీ చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. వయస్సు 18 నుంచి 25 సంవత్సరాలు ఉండాలన్నారు. వేతనం నెలకు రూ.12 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 08455-271010 నంబర్‌పై సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అమీన్‌పూర్, జూలై 10: అమీన్‌పూర్ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి గురువారం కొన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీరు వెంకట్రామిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ అమీన్‌పూర్ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ ఫీడర్స్ కొత్త సర్వీస్‌లను రిలీజ్‌లింగ్ చేయడం కొరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. లక్ష్మీ హోమ్స్ ఫీడర్ మధ్యాహ్నం 11 గంటల నుంచి 11.30 వరకు అమీన్‌పూర్ విలేజ్, పీఎన్ఆర్ కాలనీ, సాయాంబిక కాలనీ, లాలాబాయి కాలనీ, పీఎన్ఆర్ కాలనీ, ఎమ్మెస్ హోమ్స్ టీచర్స్ కాలనీ, త్రిపుర కాలనీ, మోడీ బిల్డర్స్, లింగమయ్య కాలనీ, ఎస్ఎస్ఎల్ కాలనీ, 11 కేవీ వెదిరి ఫీడర్, 11 కేవీ పీఎన్ఆర్ హిల్స్ ఫీడర్ మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు, బంధం కొమ్ము ఫీడర్ 12 నుంచి 12.30 వరకు, ఆర్ఆర్‌హోమ్స్ ఫీడర్ 12.30 నుంచి 1 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఎల్‌సీ కేవలం 30 నిమిషాలు మాత్రమే ఉంటుందని తెలిపారు. ప్రతి వినియోగదారుడు సహకరించాలని కోరారు.

ఆత్మీయ వీడ్కోలు

గుమ్మడిదల, జూలై 10: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతశిఖరాలకు తీసుకువెళ్లడానికి నిరంతరం కృషి చేసేది ఉపాధ్యాయులని హెచ్ఎం నీరజ అన్నారు. బుధవారం మండలంలోని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అమృతరావు ఉద్యోగ విరమణ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, శ్రీనివాస్‌రావు, శర్మ, ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

బొల్లారం, జూలై 10: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు పోచమ్మ బస్తీలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి ప్రారంభించారు. వృద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి రాధిక, వైద్య ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్స్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 10: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో 150, ఖమ్మంలో 150 మంది అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి 75 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తును www.tgbcstudycircle.cgg.gov.in లో 19వ తేదీ లోగా సమర్పించాలని సూచించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. కోచింగ్ సమయంలో ప్రతి అభ్యర్థికి నెలకు రూ.5 వేల స్టైఫండ్ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08455-277015, 9949592991 నంబర్లపై లేదా, సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోని వెలుగు కార్యాలయ క్యాంపస్‌లో గాని, బీసీ స్టడీ సర్కిల్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

ఆహ్లాదం.. పచ్చని తోరణం

***న్యాల్‌కల్, జూలై 10:** పండ్ల క్రితం నాటిన మర్రి, మామిడి చెట్లు రహదారులకు ఇరువైపులా స్వాగత ద్వారంగా మారి వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మండలంలోని మిర్జాపూర్(బి), గంగ్వార్, మామిడ్గి, గణేశ్‌పూర్, హుసేల్లి గుండా వెళ్లే బీదర్- జహీరాబాద్ రహదారికి ఇరువైపులా ఉన్న మర్రి, మామిడి చెట్ల కొమ్మలు అల్లుకొని ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. ముందుతరాలు నాటిన మొక్కలు నేడు మానులై నీడనిస్తున్నాయి.*

హుసేల్లి శివారులో స్వాగత ద్వారంలా అల్లుకొన్న మర్రి చెట్లు

గంగ్వార్ శివారులో రోడ్డుకు ఇరువైపుల మామిడి చెట్లు

న్యామతాబాద్ శివారులో బీదర్-జహీరాబాద్ రోడ్డుకు ఇరువైపులా..

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

గుమ్మడిదల, జూలై 10: జాతీయ రహదారిపై రేయింబవళ్లు అతివేగంగా మట్టి టిప్పర్లు నడుస్తుండడంతో గ్రామస్తులు ఆ టిప్పర్లను అడ్డుకున్నారు. మంగళవారం 9.30 గంటలకు గుమ్మడిదల మండలానికి చెందిన డా.బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుమ్మడిదల-కానుకుంట చౌరస్తా మీదుగా జాతీయ రహదారిపై నడుస్తున్న మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. భారీ సంఖ్యలో యువకులు ఆందోళన చేశారు. దాదాపు 20 మట్టి టిప్పర్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల గుమ్మడిదల శివారులో రోడ్డుపక్కన నిల్చున్న రైతు సంజీవరెడ్డిని మట్టి టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది కూడా మట్టి టిప్పర్ల అతివేగానికి ముగ్గురు అమాయకులు మృతి చెందారని మండిపడ్డారు. అనుమతులు ఉన్నాయని అక్రమంగా మట్టి టిప్పర్లను నడిపిస్తున్నారని ఆరోపించారు. అక్రమదందాకు అధికారులు సైతం వత్తాసు పలుకడం.. వీరి అక్రమ దందా నడుస్తున్నదని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇక నుంచి రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకే జాతీయ రహదారిపై మట్టి టిప్పర్లు నడువాలని హెచ్చరించారు. లేని ఏడల భారీ ఎత్తున ఆందోళన చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మట్టివ్యాపారస్తులు అంబేద్కర్ సంఘం నాయకుల డిమాండ్లకు సమ్మతించడంతో ఆందోళన విరమించారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

రామచంద్రాపురం, జూలై 10: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని ఎల్ఐజీ పార్కులో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ప్రతి ఇంటి ఆవరణంలో, పార్కుల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడకు మేలు జరుగుతుందన్నారు. ఆడవులను పెంచుకుంటేనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, వాతావరణ కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో హరితహారంలో భాగంగా కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. యాదగిరిరెడ్డి, లక్ష్మణ్, రాంబాబు, రాజలింగం, భాస్కర్, నర్సింహ, గౌస్, కుత్బుద్దీన్ ఉన్నారు.

ఎల్ఐజీలో మొక్కలు నాటిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

విద్యార్థులకు ఎన్నికల కమిషన్ నజరానా

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 10: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ చైతన్య కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన స్కిట్ కాంపిటీషన్, కవితలు, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు రూ.35 వేల పారితోషికం అందజేశారు. బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి హోతి కే తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు రూ.10 వేలు, రెండో బహుమతి బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8 వేలు, మూడో బహుమతి కంసాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.5 వేలు అందజేశారు. పాటలు, కవితలపై నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి సదాశివపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మానసకు రూ.5 వేలు, రెండో బహుమతి హోతి కే తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు శాంభవి, వైష్ణవికి రూ.4 వేలు, మూడో బహుమతి బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని దాసరి నీలిమకు రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శిఖం ఆక్రమిస్తే చర్యలు తప్పవు

హత్నూర, జూలై 10: ప్రభుత్వ శిఖం ఆక్రమిస్తే చర్యలు తప్పవని హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ హెచ్చరించారు. హత్నూర శివారులోని పెద్దచెరువు, తాళించెరువు, అల్వాయిచెరువు శిఖం భూముల ఆక్రమనలపై ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆమె చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిఖం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి శిఖం కాపాడుతామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కిష్టయ్య, నరేందర్, భిక్షపతి, రవీందర్, పెంటేశ్, అశోక్, లింగం, నగేశ్, శ్రీనివాస్, యాదగిరి, సిద్దయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాళించెరువు శిఖం భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఫర్హీన్‌షేక్

బాలలతో పనులు చేయించడం నేరం

బొల్లారం, జూలై 10: బాలలతో పనులు చేయిస్తున్న యజమానులపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలకు దిగారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాల మేరకు బొల్లారం పారిశ్రామిక వాడలోని పలు వ్యాపార సముదాయాల్లో బుధవారం లేబర్, చైల్డ్ డిపార్ట్మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గాంధీ చౌరస్తా సమీపంలోని మాధవరెడ్డి కాంప్లెక్స్‌లోని రాందేవ్ కిరాణా దుకాణంలో పని చేస్తున్న 14 ఏండ్ల బాలుడిని అధికారులు అదుపులోకి తీసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాలలతో నిర్బంధంగా పనులు చేయించడం నేరమని హెచ్చరించారు. పరిశ్రమలు, వ్యాపార సముదాయాలతోపాటు మరెక్కడైనా బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్, లేబర్ డిపార్ట్మెంట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ మల్లేశం, చైల్డ్ డిపార్ట్‌మెంట్ అధికారి యాదగిరి, ఎస్సై గోపియానాయక్ ఉన్నారు.

బాల కార్మికుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్న అధికారులు

మౌలిక వసతుల కల్పనలో రాజీపడం

బొల్లారం జూలై 10: మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప బస్తీ, వైఎస్సార్ కాలనీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా మున్సిపల్ నిధులతో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులతోపాటు తెలంగాణ ఆదర్శ పాఠశాల పక్కన ఏర్పాటు చేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను నాణ్యతగా చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా కాలనీలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ శ్రీకాంత్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, నబి పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి



కోహీర్ తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కోహీర్, జూలై10: ఎన్నికల సందర్భంగా రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు కోరారు. బుధవారం కోహీర్ పట్టణంలోని తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలం పంటల సాగు ప్రారంభమై నెల గడిచినా ఇంత వరకు రైతు భరోసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కిష్టయ్య, రమేశ్, సతీశ్, నరేశ్, వంశవర్ధన్‌రెడ్డి, సాయికిరణ్, సిద్దేశ్వర్, వెంకట్, శంకర్, గోపాల్, జగన్, అనిల్ పాల్గొన్నారు.

వ్యాధులతో జాగ్రత్త

రాయికోడ్, జూలై 10: వానకాలంలో సోకే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి జగదీశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. త్వరలోనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అందుకు సిబ్బంది ఏర్పాట్లు చేయలని ఆదేశించారు. మండల పరిధిలోని వసతి గృహాలను మండల స్థాయి అధికారులు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఎంపీవో అంజలీదేవి, ఉపాధిహామీ అధికారులు రమేశ్, విష్ణు ఉన్నారు.

పనికి తగ్గ వేతనాలు చెల్లించాలి



ఝరాసంగం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఝరాసంగం, జూలై 10: సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతూ డిమాండ్స్ డేలో భాగంగా కేంద్ర వైఖరిని నిరసిస్తూ ధర్నా చేశామన్నారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగమణి, చంద్రకళ, శాంతమ్మ, జగదాంబ పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

గుమ్మడిదల, జూలై 10:కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని బొంతపల్లి, దోమడుగు పారిశ్రామికవాడలో సీఐటీయూ కార్మిక సంఘం నాయకుడు శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో న్యూ లాండ్ పరిశ్రమ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి నర్సింహాగౌడ్, ఆర్గనైజర్ కార్యదర్శి దేవేందర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

రాయికోడ్, జూలై 10: తమకు న్యాయం చేయాలని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, పంచాయతీ కార్మికులు పలు డిమాండ్లతో కుడిన వినతిపత్రం అందజేశారు. రాయికోడ్‌లో మండల పత్యేక అధికారి జగదీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్‌కు సీఐటీయూ నాయకుడు దశరథ్ వినతిపత్రాలు ఇచ్చారు.

కాల్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

జిన్నారం, జూలై 10: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని టీఐడీసీ పరిశ్రమ ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. నాయకులు శ్రీధర్‌రావు, వెంకటేశ్, నరసింహగౌడ్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, సత్తయ్య పాల్గొన్నారు.

వేతనాల కోసం వినతి

కోహీర్, జూలై 10: మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆరోపించారు. బుధవారం తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమకు వేతనాలు అందేలా చూడాలని కోరారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

కోహీర్, జూలై 10: పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పలు గ్రామాల ఆశ వర్కర్లు కోరారు. డిమాండ్ డే సందర్భంగా బుధవారం కోహీర్ పట్టణంలోని తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె చేస్తాం

హత్నూర, జూలై 10: తమ సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. ఈ మేరకు తహసీల్దార్ ఫర్హీన్‌షేక్‌కు వినతిపత్రం ఇచ్చారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శంకరయ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావత్ ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా నా యొక్క క్లయింట్ పెద్దసాయన్నోళ్ళ నరేష్